APTEL/2009/29308

స్నేహిత

# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

గురువారం 3-04- 2025

సంపుటి : 16 | సంచిక : 142 | ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్ | పేజీలు : 4 | వెల : రూ. 4

epaper.expresstelugudaily.com

## రియల్ ఎస్టేట్ కోసమే సెంట్రల్ వర్సిటీ భూములు

- ఢిల్లీ పెద్దలకు కప్పం కోసమేనని ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపణ

**న్యూఢిల్లీ/హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసం సెంట్రల్ యూనివర్సిటీని సీఎం రేవంత్‌రెడ్డి విధ్వంసం చేస్తున్నాడని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీఆర్‌ఎస్‌వీ, హెచ్‌సీయూ విద్యార్థులతో పాటు ఎమ్మెల్సీ కలిశారు. భూములను కాపాడాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు కేంద్రమంత్రిని కలిశామన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. మానవత్వం లేకుండా కర్కషత్వంతో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ-లో 400 ఎకరాలను విధ్వంసం చేస్తున్నారని.. రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసం యూనివర్సిటీ-ని విధ్వంసం చేస్తున్నారన్నారు. భూములను కాపాడుతామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని.. భారత జాతీయ పక్షి నెమళ్లు కాపాడాలని ఘోషిస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో హెచ్‌సీయూ భూములు గెలవగానే.. వాటిని తాకట్టు-పెట్టి రూ.20వేలకోట్ల అప్పు తెచ్చారని.. శత్రుదేశాలపై యుద్ధం చేసినట్లు- హెచ్‌సీయూపై సీఎం, రాష్ట్ర ప్రభుత్వం దాడి చేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ నీచంగా వ్యవహరిస్తున్నారని.. ఒక జింకను చంపితే ఐదేళ్ల శిక్ష సల్మాన్ ఖాన్‌కు పడితే.. వందల నెమళ్లు.. జింకలను చంపుతున్న రేవంత్‌రెడ్డికి ఎన్నేళ్ల శిక్ష పడాలని ప్రశ్నించారు.

# లోక్‌సభలో వక్ఫ్ చట్ట చట్టసవరణ బిల్లు

- చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు
- లేకుంటే పార్లమెంట్ స్థలం కూడావక్ఫ్‌దే అంటారు
- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి.

## అడవులో వణ్య ప్రాణాలు ఘోష వినపడటం లేదా..?

### హెచ్‌సీయూ ఘటన ఫలితం రేవంత్ అనుభవిస్తాడు

### రేవంత్‌ను జైలులో పెడితే కానీ.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండదు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎంతమంది మేధావులు, విద్యావంతులు హెచ్చరిస్తున్నా హెచ్‌సీయూ భూములను లాక్కుకుంటున్నారని.. ఇది ఫలితం రేవంత్‌రెడ్డి తప్పక అనుభవిస్తాడని ఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. హెచ్‌సీయూ బయో డైవర్సిటీ పార్క్ విధ్వంసం, భూముల కుంభకోణంలో కాంగ్రెస్ గుంట నక్కల ముఠాపై వెంటనే సుమోటోగా కింది కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్ 29, అటవీ సంరక్షణ చట్టం 1980లోని సెక్షన్ 2, తెలంగాణ వాల్టా చట్టం 2002లోని సెక్షన్ 35 కింద కేసులు నమోదు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, అతనికి సహకరిస్తున్న మంత్రులందరిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి. అప్పుడే తెలంగాణ సురక్షితంగా ఉంటుంది అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఊర్లలో ఎడ్ల బండి మీద ఇల్లు కట్టడానికి వాగు నుండి తట్ట ఇసుకను తీసుకపోతే ఆ బండిని సీజ్ చేసి స్టేషన్‌లో పెట్టే పోలీసులు, రెవెన్యూ అధికారులకు.. అడవిలో వన్యప్రాణుల ఘోష వినిపించడం లేదా..? బుల్డోజర్లు కనిపించడం లేదా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ ఎక్కడ? విద్యార్థులను కిరాయి ఉద్యమకారులన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి రియల్ దందాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ కడుతున్న కట్టడాలను ప్రజలు ఎవరూ కొనకుండా బహిష్కరించాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

## రాహుల్ ఆదేశాల మేరకు బిసి కులగణన



### మా రాష్ట్రంలో ఆమోదించిన బిసి బిల్లును ఆమోదించండి

### గుజారత్‌లో అమలుచేయాలని మేం కోరడం లేదు • మా డిమాండ్‌కు మీరు మోకాలడ్డవద్దు • జంతరమంతర్ బిసి ధర్నాలో సిఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కులగణన చేపట్టామని అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరాగాంధీ దళిత్ కాదని.. కానీ ఆమె అందరికీ భూములు ఇచ్చారని.. ఇళ్లు కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ రాష్ట్రంలో చేయమని మేము అడగలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని సిఎం రేవంత్ అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు- 'అయిననూ హస్తిన పోయి రావలె'.. అన్నట్లు ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నాను' అని రేవంత్ అన్నారు.

## ఎమ్మెల్సీగా నాగబాబు ప్రమాణం

### అభినందించిన మంత్రి అచ్చన్నాయుడు



**అమరావతి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు శాసన మండలి సభ్యునిగా బుధవారం శాసన మండలి చైర్మన్ శ్రీ మోషేన్ రాజు సమక్షంలో ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. గత మార్చి నెలలో జరిగిన శాసన సభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా పోటీకి దిగిన నాగబాబు శాసన మండలి సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సూచనలకు అనుగుణంగా బుధవారం శాసన మండలిలో ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాగబాబుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు , శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ , ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు , నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ , మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయ భాను తదితరులు శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం నాగబాబు మర్యాదపూర్వకంగా సిఎ చంద్రబాబును కలిశారు.

## నియోజకవర్గానికి లక్షమంది తరలింపు

### మెదక్, నిజామాబాద్ నేతలకు కెసిఆర్ సూచన



**గజ్వేల్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశంచేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు- చూసుకోవాలని నేతలకు సూచించారు.

## క్లైమాక్స్‌కు చేరిన చంద్రబాబు మోసాలు

- సూపర్ సిక్స్ పథకాలకు నిధులు లేవంటూ అబద్దాలు
- తెల్ల రేషన్ కార్డుదాల సంఖ్యను తగ్గించే ఎత్తులు
- స్థానిక ఎన్నికల్లో వేలుపెట్టి భంగపడ్డ టిడిపి
- స్థానిక ప్రజాప్రతినిధులతో వైకాపా అధినేత జగన్



**అమరావతి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** చంద్రబాబు మోసాలు క్లైమాక్స్‌కు చేరుకుంటున్నాయని, పి-4 అనే కొత్త మోసాన్ని మొదలుపెట్టాడని, మరోసారి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు.. వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశమైన ఆయన. కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సమాజంలో ఉన్న 20 శాతం పేదవాళ్ల బాగోగులకు 10 శాతం మందికి అప్పగిస్తాననడం దారుణమన్నారు. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయో చంద్రబాబుకు తెలుసా అన్నారు. రాష్ట్రంలో 1.61 కోట్ల కుటుంబాలు ఉంటే అందులో 1.48 కోట్ల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. రాష్ట్రంలో ఆదాయ పన్ను కట్టేవారు ఎంతమంది ఉన్నారో చంద్రబాబుకు తెలుసా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో 8.6 లక్షల మంది ఇన్‌కంట్యాక్స్ కడుతున్నారు. ఆయన చెప్పిన ప్రకారం.. ఈ 1.48 కోట్ల మంది కుటుంబాలను 8.6 లక్షల మందికి అప్పగించాలి కదా? ఇన్ని రకాలుగా మోసాలు చేస్తాడు చంద్రబాబు.

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సహకరించండి

- పెట్టుబడులతో ముందుకు వస్తే అభివృద్ధి సాధ్యం
- నూతన ఆవిష్కరణలకు ఎపి హబ్ కావాలి
- పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో భేటీలో చంద్రబాబు



**అమరావతి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ని తీర్చిదిద్దేందుకు... 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగా పారిశ్రామిక వేత్తలు రావాలని, నూతన ఆవిష్కరణలకు ఏపీ హబ్ కావాలని, అదే స్థాయిలో పెట్టుబడులు కూడా ఆశిస్తున్నామని అన్నారు. అందిరిలో స్ఫూర్తి నింపేందుకే ఇన్నోవేషన్‌కు హబ్‌కు రతన్ టాటా వంటి గొప్ప వ్యక్తి పేరు పెట్టామని చెప్పారు. బుధవారం సచివాలయంలో పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' గురించి ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఆర్టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటా గ్రూపు, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సహా మరికొందరు ప్రముఖులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. భారతీయులు దేశవిదేశాల్లో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగారని, అలాగే తలసరి ఆదాయంలోనూ విదేశీయులు కన్నా ఎక్కువ ఆర్జిస్తున్నారని, వారిలో 30 శాతం తెలుగు ప్రజలు ఉన్నందుకు తనకు గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. నిజానికి ఇప్పుడు తెలుగు ప్రజలు ఈ స్థాయికి చేరుకోవడానికి తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు తీసుకువచ్చిన సంస్కరణల ఫలితమని చెప్పారు.

# రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజా ప్రభుత్వం ద్వారా విప్లవాత్మకమైన మార్పు

## కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** దేశంలో ఏ రాష్ట్రంలో పంపిణీ చేయని విదంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం కోహీర్ మండల పరిధిలో పిచేర్యాగడి పాత తాండ గ్రామ పంచాయతీలో కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలసి వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా రాథోడ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది.అణగారిన, బడుగు, బలహీన వర్గాల దళిత,గిరిజన,బీసీ, మైనారిటీ ప్రజలకు ఆహార భద్రత కల్పించాలి అన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంకల్పము. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంబంధించి ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తుందని అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెదటి నుండి పేద ప్రజల పక్షపాతి అని అన్నారు. అణగారిన,బడుగు,బలహీన వర్గాల దళిత,గిరిజన,బీసీ,మైనారిటీ ప్రజలకు ఆహార భద్రత కల్పించాలి అన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంకల్పము ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) పథకాన్ని డెబ్బై మూడు సంవత్సరాల క్రితం 1957లో మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టారని అని అన్నారు.గత ప్రభుత్వంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు డీలర్లతో కుమ్మక్కై ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల దొడ్డు బియ్యం దారితప్పి కోళ్ల ఫారాలు, బీర్ల కంపెనీలు, హోటళ్ళు,తోపుడు ఇడ్లీ,దోసెల బండ్లకు చేరుతూ అవినీతి,అక్రమాలకు ఆలవాలం కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంకురార్పణకు శ్రీకారం చుట్టింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు చౌహాన్ మేఘునాథ్,డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ చౌహాన్ లస్కర్ నాయక్,కాంగ్రెస్ నాయకులు రామావత్ విజేందర్,గోపాల్ రాథోడ్,దశరథ్, సునీల్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

- ఎంపీడీవో సోమలింగం

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల కేంద్రంలో జడ్పీహెచ్ హై స్కూల్ పాఠశాలలో నేటితో పదవ తరగతి పరీక్షలు ముగిశాయి,పరీక్షల కేంద్రంలో తనిఖీ నిర్వహించి,ఎక్కడ మాస్కాపింగ్ గాని మాల్ ప్రాక్టీస్ గాని జరగలేదని పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలపడం జరిగింది. పరీక్ష కేంద్రం వద్ద ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు తో పాటు మంచినీటి సమస్యలు తలెత్తకుండా అదేవిదంగా 144 సెక్షన్ విధించడం జరిగింది. అధికారులు చేసిన కృషిని అభినందించారు.

## బాధిత కుటుంబాలకు యెండల పరామర్శ



**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీ నారాయణ బుధవారము పరామర్శించారు.మండల కేంద్రా నికి చెందిన చిత్తరి హన్మాండ్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.అలాగే కోటగిరి మీదిగల్లికి చెందిన రాయ కూర్ మానస,బిడ్డకు జన్మనిచ్చిన పదిహేను రోజులకే పిడ్స్ రావటంతో ఆమె మృతి చెందారు.వీరి కుటుంబాలను యెండల లక్ష్మీనారాయణ కోటగిరి మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు ఏముల నవీన్తో కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన బాధ్యత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు పుల్లెల మోహన్ రావు,మామిడి శ్రీనివాస్,రోషన్, చిత్తరి రాజు,తదితరులు ఉన్నారు.




## అంబేద్కర్ యువజన సంఘం నూతన గ్రామ కమిటీ ఎన్నిక

- మల్కాపూర్ గ్రామంలో ఏకగ్రీవంగా అంబేద్కర్ కమిటీ ఎన్నిక

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడపూర్ మండల మల్కాపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నుకోవడం జరిగింది.దీనికి సహకరించిన ప్రతి ఒక్క యువకునికి జై భీమ్ లు అంబేద్కర్ సంఘ అధ్యక్షులు మద్దూరు చంద్రమౌళి ఉపాధ్యక్షులు వెంకటేష్,ప్రధాన కార్యదర్శి దామోదర్,కోశాధికారి మద్దూరు గోవర్ధన్,సమక్త కార్యదర్శి లక్ష్మయ్య,సోషల్ మీడియా భాను ప్రసాద్,పవన్,ప్రవీణ్ కుమార్, సలాదారులు అశోక్ కుమార్, రమేష్,వెంకటయ్య,శివ,విష్ణు,సంతోష్,రమేష్ నర్సింలు,వెంకటయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## పేదవాడి సంక్షేమమే మా లక్ష్యం

- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పేదవాడి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో గల పౌరసరఫరాల దుకాణంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి సన్నబియ్యం కొనుగోలు చేసి అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్,మాజీ కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంగ్టిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారభం

- అధికారులు నాయకులు పేదల సంక్షేమం కోసమే సన్న బియ్యాం



.సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్రంలో నీ రేషన్ షాపులో బుధవారం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్నంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ను స్థానిక అర్ ఐ తాజొద్దిన్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చందర్ రెడ్డి మాజీ జెడ్పీటీసీ సర్దార్ రాథోడ్,మాజీ ప్యాక్స్ చైర్మన్ మనోజ్ పటేల్ యువ నాయకుడు కుర్తె శ్రీనివాస్ రెడ్డి సంతోష్ రెడ్డి డీలర్ నాగుర్ మారుతి,లక్ష్మణ్, మనోహర్, మండల దళిత నాయకులు శంకర్ డేవిడ్ తదితరులు పాల్గొని ప్రారంభించారు.రాష్ట్రంలోని ప్రతి పేద మధ్యతరగతి కుటుంబ ప్రజలు కూడా సన్న బియ్యం తినలేని దృద సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది అని తెలిపారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి సన్న బియ్యం పంపిణీ



- కేరెల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సభాపతి
- ముఖ్యమంత్రి సహాయ నిధి కింద9 మంది లబ్ధిదారులకు 5.65 లక్షల చెక్కుల పంపిణీ
- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లాలో అర్హులైన ప్రతి పేదవాడికి సన్నబియ్యాన్ని అందించడం జరుగుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం దారూర్ మండలం కేరెల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ, ధారూర్ లోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాపతి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 2,48,122 రేషన్ కార్డుల ద్వారా 8,52,122 మంది లబ్ధిదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా నెలకు 5,582 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ జరుగుతుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులకు ప్రజా పంపిణీ పథకంలో భాగంగా చౌక ధరల దుకాణాలు ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల నూతన రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.అనారోగ్యానికి గురై చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి, కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. దారూర్ మండలంలో షాదీ ముబారక్,కళ్యాణ్ లక్ష్మి పథకంలో భాగంగా 94 మంది లబ్ధిదారులకు అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 5 లక్షల 65 వేల రూపాయల చెక్కులను 9 మంది లబ్ధిదారులకు స్పీకర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాసు చంద్ర,జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు,తహసిల్దార్ సాజిదా బేగం, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ప్రారంభం

- ప్రజలు అంబలి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- పాల విఠల్ సేట్ గుప్తా




**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వేసవిలో ఎండ తీవ్రతను తగ్గించడానికి ఏర్పాటు చేసిన చలి వేంద్రం,అంబలి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పొల విఠల్ సేట్ గుప్తా పేర్కొన్నారు.బుధవారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పోల రాఘవేంద్ర,దీప్తి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పోల సాయి,స్నిగ్ధ జ్ఞాపకార్థంతో ఏర్పాటు చేసిన చలివేంద్రం అంబలి కేంద్రాలను గ్రామ పెద్దలతో కలిసి ఆయన ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉన్నాయని గ్రామ ప్రజలతో పాటు పలు అవసరాల నిమిత్తం ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు,ప్రయాణికులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాశెట్టి రాజు గుప్త,పాషా సేట్, గజానన్ సేట్,హనుమాన్లు,తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండి పై నెలకొల్పాలి

- గీతా పని వాళ్ళ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ.విటల్ గౌడ్

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండి పై నెలకొల్పాలనీ గీతా పని వాళ్ళ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ.విటల్ గౌడ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.బుధవారం కోటగిరి మండల కేంద్రంలో కోటగిరి గీత పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో బహు జనుల నాయకుడు శ్రీ శ్రీ సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ 315 వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి,జోహార్ పాపన్న గౌడ్ అని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ తెలంగాణ రాష్ట్ర గీతా పనివాళ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ.విటల్ గౌడ్ మాట్లాడుతూ..బహుజనులను ఏకం చేస్తూ రాజ్యాధికారం కోసం పోరాడితే సాధించలేనిది ఎదికూడ ఉండదని చెప్పిన మహనీయుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. గౌడ కులంలో పుట్టి,వారి తండ్రి ఎక్కిన తాడి చెట్లను చూస్తూ గీత నేర్చుకున్న పాపన్న గౌడ్,జమీందారులు చెట్లు కిస్తూ వేస్తుంటే వారికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు పాపన్న గౌడ్ అని అలాంటి గొప్ప మహనీయుల విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై నెలకొల్పాల నీ ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కోటగిరి గౌడ మండల కార్యదర్శి ఏ.గంగా ప్రసాద్ గౌడ్,గీతా కార్మికులు ఎం.ప్రకాష్ గౌడ్,ఎం.కృష్ణ,ఎం.శ్రీనివాస్ గౌడ్,సొసైటీ ఏ.శ్రీనివాస్ గౌడ్,ఎస్.సాయి గౌడ్,కృష్ణ గౌడ్,బి.ప్రశాంత్ గౌడ్,యువకులు, సొసైటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



# బోనస్ స్కాంపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలి

- దుబాస్ రాములు
- స్కాంలో భాగస్వామ్యమైన రైస్ మిల్లులకు సీఎంఆర్ ను నిలిపివేసి మిల్లులను సీజ్ చేయాలి
- ఏ.విఠల్ గౌడ్



**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బోగస్ రైతుల పేర్లతో బోనస్ డబ్బులు చెల్లింపులు సుమారుగా రూ.50 లక్షల అవినీతి జరిగిన బోనస్ స్కాంపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలనీ సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ దుబాస్.రాములు డిమాండ్ చేశారు.బోనస్ స్కాంలో భాగస్వామ్యమైన రైస్ మిల్లులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని వారి యొక్క సీఎంఆర్ కేటాయింపులను రద్దుచేసి రైస్ మిల్లులను సీజ్ చేయాలని కోటగిరి మండలం సిపిఐ కార్యదర్శి ఏ.విఠల్ గౌడ్ పేర్కొన్నారు.బుధవారం సిపిఐ పార్టీ,రైతుల ఆధ్వర్యంలో కోటగిరి సహకార సంఘం కార్యాలయం ముందు వారు ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ దుబాస్.రాములు మాట్లాడుతూ.. కోటగిరి గ్రామ సొసైటీకి గత ఖరీఫ్ లో వరి ధాన్యం అమ్మిన రైతుల జాబితాను బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు.బోగస్ రైతుల పేర్లతో బోనస్ డబ్బులు చెల్లింపులు సుమారుగా రూ.50 లక్షల అవినీతి జరిగిందని.దీనిపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడ్డ కోటగిరి సొసైటీ చైర్మన్ కూచి సిద్దు,కార్యదర్శిని కూడా సస్పెండ్ చేయాలని అలాగే కోటగిరి గ్రామ మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కాపుగాండ్ల శ్రీనివాస్,ఎండి ఇస్మాయిల్,శ్రీహరిలతో పాటు ఇంకా కొంతమంది అవినీతికి పాల్పడ్డారని.వీరందరి నుండి డబ్బులు రికవరీ చేసి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కోటగిరి సొసైటీ నుండి శ్రీ సాయి అగ్రో ఇండస్ట్రీస్,ఓం సాయి ట్రేడర్స్,ఎస్.ఏ ట్రేడర్స్,జి.ఎం.కె ఇతర రైస్ మిల్లులకు ఏ ట్రక్ షిట్ ద్వారా ఎంత మంది రైతుల పేర్లతో ఎన్ని క్వింటాల వడ్లు పంపారో అనే విషయాన్ని బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రంలో వడ్లు అమ్మకుండానే దొంగ పేపర్లు సృష్టించి కౌలునామా పేర్లతో ఎం.ఎస్.పి రేట్ల డబ్బులు అక్రమార్కుల ఖాతాలోకి జమ అయిన తర్వాత బోనస్ డబ్బులు కూడా మింగారని ఆయన తెలిపారు.దీనిపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ శాఖ అధికారులు విచారణ చేసి బోనస్ డబ్బులు కాజేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సొసైటీ చైర్మన్, కార్యదర్శి,ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్, సిబ్బందిపై కొనుగోలు కేంద్ర ఇన్చార్జిలతోపాటు కోటగిరి గ్రామంలో ఉన్న రైస్మిల్ యజమానులపై అప్పటి అగ్రికల్చర్ అధికారిపై న్యాయ విచారణ చేసి బోనస్ డబ్బుల స్కాము ను పూర్తిస్థాయిలో బయటకు తీయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కోటగిరి మండల సిపిఐ కార్యదర్శి ఏ.విఠల్ గౌడ్ మాట్లాడుతూ..వర్షాకాలంలో చాలామంది రైతులు ప్రైవేటు వ్యాపారస్తులకు అనగా రైస్ మిల్లులకు వడ్లను 2060 రూపాయలకు మాత్రమే అమ్ముకున్నారని,దీనిని ఆసరా చేసుకొని సొసైటీ చైర్మన్ ఆయన అనుచరులు రైస్ మిల్ యజమానులతో ములాఖత్ అయి బోనస్ డబ్బులు రూ.500 మద్దతు ధరలో రూ.300 మొత్తం క్వింటాలకు రూ.800 స్కామ్ చేశారని.పైగా సీఎంఆర్ పేరుతో ఈ వడ్లను రైస్ మిల్లులకు కట్టబెట్టారని ఈ రైస్ మిల్లులపై చట్టరీత్య చర్యలు తీసుకొని సీఎంఆర్ కు సంబంధించిన అలాట్మెంట్ నిలిపివేసి రైస్ మిల్లులను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రైతులకు సంబంధించి బోనస్ పైన ఇంత అవినీతి జరిగినా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తమ యొక్క అనుచరుల పైన ఎందుకు చర్యలు తీసుకుంటలేరని రైతు సంక్షేమం కొరకే పార్టీ మారనని చెప్పి,మోసం చేస్తున్న వ్యక్తులను ఎందుకు కాపాడుతున్నారని ఆయన విమర్శించారు.ఈ ధర్నాలో సిపిఐ నాయకులు నల్ల గంగాధర్,బుడాల రాములు,కోటగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్,మాజీ ఎంపీటీసీ సలీం,కూచి సాయిబాబు,నజీర్,నల్ల నరసయ్య,బూడాల శివరాజు, హనుమాన్లు,సోహెల్, వాజిద్, పాకాల సాయిలు,ఆకుల లక్ష్మణ్,ఎర్ర సాయిలు, రైతులు పాల్గొన్నారు.



## ఐకేపీ ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సంవత్సరం కూడా యాసంగి సీజన్కు గాను ఐకేపీ సెంటర్ ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ఆదేశాలు జారీ చేసింది.అందుకు బుధవారం పోతంగల్ మండలంలోని కొడిచెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కొడిచెర్ల గ్రామ సంఘం (ఐకెపి)ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి కోటగిరి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుప్పాల శంకర్,గ్రామ సంఘం అధ్యక్షురాలు పోషవ్వ,కార్యదర్శి బాలమణి,ఐకేపీ ఏపిఎం బస్వంత్ రావు,సీసీలు రమ,సాయిబాబా విఠల్,రమేష్,సీఏ శిరీష,రైతులు పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు వట్టిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మీ శేషారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గం లోని మురాడి వెంకటేశం రేషన్ దుకాణం లో బుధవారం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మల్లయ్య,ఆర్ఐ శరణప్ప,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్,నాయకులు నరసింహారెడ్డి, సదానందం,జైపాల్, బాలరాజ్, బాలకిషన్, శ్రీశైలం,శశిధర్ రెడ్డి తదితరు పాల్గొన్నారు.



# రేషన్ కార్డున్న ప్రతిఒక్కరికి సన్నబియ్యం అందజేత

- పేదోళ్ళు సన్నబియ్యం తినాలనే లక్ష్యం కాంగ్రెస్ పార్టీద
- నియోజకవర్గంలో నేటికి వెయ్యికోట్ల రూపాయలతో అభివృద్ధి
- మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్



**మెదక్ ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మెదక్ రేషన్ కార్డున్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలోని రేషన్ దుకాణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఉగాది కానుకగా సన్నబియ్యం పథకాన్ని ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా జాయింట్ కలెక్టర్ నగేశ్,ఆర్డీఓ రమాదేవి, మెదక్ ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు,ఆర్ఐ లక్ష్మణ్ లు పాల్గోన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేదోళ్ళు సన్నబియ్యం తినాలనే ముఖ్య లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వంది అని ఆయ గుర్తుచేశారు.అంతే కాకుండా పేదలకు రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం ఇస్తామని అన్ని ప్రధాన పార్టీలు ఎన్నో ఏళ్లుగా చెబుతూనే వచ్చాయని ఆయన అన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఇది కూడా ఒకటి అని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఖరీఫ్ సీజన్లో రైతుల నుండి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి 24 లక్షల టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేసిందని ఆయన గుర్తుచేశారు.వాటిని మిల్లింగ్ చేయించి,వచ్చిన బియ్యాన్ని రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. అంతే కాకుండా సంవత్సర కాలంలోనే మెదక్ నియోజక వర్గంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ పవన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు గౌడ్,తాజా మాజీ మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్,తాజా మాజీ కౌన్సిలర్ లు దాయర రాజలింగం, లక్ష్మినారాయణ గౌడ్,రాగి అశోక్, దొంతి లక్ష్మి ముత్యం గౌడ్,గోదల సాయి, దుర్గప్రసాద్,సమీ,బొద్దుల క్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు లల్లూ,గూడూరి శంకర్,దేవులా, గాడి రమేశ్,నాగరాజు,బట్టి సాయి, అశోక్,ఎండి.సూఫి, ముజాంబిల్, మైసన్,అబ్బు,సాదిక్, కొండ శ్రీను, ప్రవీణ్,సుభాష్ చంద్రబోస్, చింతల శ్రీనివాస్,శివరామక్రిష్ణ,గంట రాజు లతో పాటు తదితరులు పాల్గోన్నారు.




## ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**పటాన్ చేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పటాన్ చేరు లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి చిన్నారుల నృత్యాలు, ఆటపాటలతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణమంతా సందడిగా మారాయి,తమ చిన్నారుల నృత్యాలు ఆటపాటలు చూడడానికి చూడాలని వచ్చిన తల్లిదండ్రుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ భీమ్సేన్,వైస్ చైర్మన్ ప్రణయ్ కుమార్,జనరల్ సెక్రటరీ పవన్ కళ్యాణ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ..గత ఆరు రోజులుగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు విజయవంతం చేయడానికి స్కూల్ టీచర్లు చిన్నారులు ఎంతో ప్రాక్టీస్ చేసి ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదాలు అని అన్నారు.

## ఆటవెలది పద్యాలు

పసిడిపంట లివ్వు పరమేశజగమున
సిరులనిచ్చి మాదుచింత దీర్చు
సల్లగుంచు స్వామి సకలజీవమ్ములన్
శరణు రామలింగ! శరణునీకు

వానకురిసి వాగు వరదలుపారంగ
పంటపండి రైతు పరవశింప
రైతురాజు యవ్వ రాజ్యంబు రావలెన్
దామగుండ వాస రామలింగ!%శ్రీ

సామబువ్వ లార్క సజ్జలురాగులు
కొర్రలున్న జాలు కోరిదినుడు
ఎవరుతిందు రిపుడు యెన్కటిగాసము
దామగుండ వాసరామలింగ!

నాటికూడు మిన్న నేటికినింకను
మందులేని తిండి మంచి బలము
యెంతగట్టివారు యెనుకటి మనుషులు
దామగుండ వాస రామలింగ!



బైండ్ల నర్సింహులు
వికారాబాద్
7989938530

# గుర్తుతెలియని మహిళను కాల్చి దారుణ హత్య

- దారుణంగా హత్య చేసి కెనాల్ కాల్వలో పడేసిన గుర్తుతెలియని దుండగులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన తాండూర్ డీఎస్పీ బాలకృష్ణ రెడ్డి,రూరల్ సీఐ నాగేష్,ఎస్ఐ గిరి
- మహిళను కాల్చి కెనాల్ కాల్వలో పడేసిన దుండగులు
- పూర్తిస్థాయిలో లోతుగా విచారణ చేస్తున్నాం
- త్వరలో నిందితులను పట్టుకుంటాం తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి,రూరల్ సిఐ నాగేష్
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆనవాళ్లు పరిశీలించిన పోలీసులు



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పెద్దేముల్ గ్రామ శివారులోని కెవిపి కెనాల్ (పెద్ద ఖానల వద్ద) కాల్వలో సుమారు 35 ఏండ్లు వయస్సు ఉన్న ఓ మహిళ మృతదేహం లభ్యం అయింది.బుధవారం ఉదయం గమనించిన స్థానికులు పెద్దేముల్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకొని సంఘటనా స్థలానికి తాండూర్ డీఎస్పీ బాలకృష్ణ రెడ్డి, రూరల్ సీఐ నాగేష్,ఎస్ఐ గిరిలు చేరుకుని మహిళ మృతదేహాన్ని, చుట్టూ ప్రక్కల పరిసరాలను పరిశీలించారు.గుర్తు తెలియని దుండగులు మహిళ ముఖాన్ని కాల్చి కేనాల్ కాలువలో పడేసి వెళ్లిపోయారు.సంఘటనా స్థలంలో మృతురాలి ముఖంపైన, ఎడమ చేతిపైనా కాల్చిన ఆనవాళ్లు ఉన్నాయి.అదే విధంగా మహిళ ఎడమ చేతి పై యశోద అనే పేరు ఉన్న పచ్చబొట్టును కూడా పోలీసులు గుర్తించారు. మృతురాలు గులాబీ, ఎరుపు రంగు కలర్ చీర ధరించి ఉందన్నారు.అనంతరం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు చేరుకొని మహిళ మృతికి గల కారణాలపై ఆరా తీశారు.ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.ఈ సందర్భంగా తాండూర్ డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ..మృతికి గల కారణాలు తెలుసుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని, అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశామని,త్వరలోనే నిందితులను పట్టుకుంటామని,ఈ దారుణ హత్యకు సంబంధించి త్వరలో పూర్తి సమాచారం అందిస్తామని అన్నారు. మరోవైపు మృతురాలికి సంబంధించి ఎవరైనా ఆమెను గుర్తుపడితే 87125670053, 87125670051 ఫోన్ నెంబర్ లకు సమాచారం అందించాలని తాండూరు రూరల్ సిఐ నాగేష్ సూచించారు.

# రాజీవ్ యువ వికాస పథకంను అధికారులు అప్రమత్తంగా ఉండి విజయవంతం చేయాలి

- రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు ఏప్రిల్ 14 వరకు పొడిగింపు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని,ఈ పథకం అమలు కు అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఎంపిడిఓలు, తహసీల్దార్ లు,మున్సిపల్ కమిషనర్ లకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి మండల కేంద్రములోరాజీవ్ యువ వికాస కేంద్రం ఏర్పాటు చేసి,రాజీవ్ యువ వికాస కేంద్రాల ద్వారా లబ్ది దారులనుండి దరఖాస్తు ల సేకరణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించండము జరుగుతుందని,రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుందని, అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని,నిరుద్యోగ యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి పదివేల కోట్లు ఖర్చు చేస్తుందని, అధికారులు అంతా మనసుపెట్టి పనిచేయాలని ఆదేశించారు.లబ్ది దారులకు సంబందించిన కుల,ఆదాయ, ధ్రువీకరణ సర్టిఫికెట్ లను తహసీల్దార్ లు వెంటనే జారీ చేయాలనీ అధికారులకు ఆదేశించారు. 50 వేల వరకు లబ్ధి పొందిన వారికి వారం రోజులపాటు, 50 వేల నుంచి రెండు లక్షల వరకు లబ్ధి పొందిన వారికి 15 రోజులపాటు,2 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెలరోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన వారికి వెంటనే గ్రౌండింగ్ చేసి నగదు అందజేయాల్సి ఉంటుందని అన్నారు.జూలై మొదటి వారం వరకు ఈ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రౌండ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి మండలం లో ఒక యువ అధికారిని నియమించాలని ఆదేశించారు. సన్న బియ్యం పథకం పేదవారి గుండెలో శాశ్వతంగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని, ధనిక,పేద అనే తేడా లేకుండ ఉండాలనే ఉద్దేశం తో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని తీసుకు వచ్చిందని,ఈ పథకాన్ని డీలర్లు పక్కద్బంధీగా అమలు చేయాలని, డీలర్లు ఎవ్వరు కూడా లబ్ధిదారులకు సన్న బియ్యం కాకుండా దొడ్డు బియ్యం ఇవ్వకూడదని,ప్రతి డీలరు ప్రభుత్వం ఆదేశాల మేరకు సన్న బియ్యం పంపిణీ కి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పెట్రోల్ బంక్ లకు సంబధించి తహసీల్దార్ లు స్థల సేకరణ చేపట్టాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్,సుధీర్,డిఆర్డిఓ శ్రీనివాస్,నవీన్, హనుమంతు రావు,కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

- పూల్ సింగ్ నాయక్ గిరిజన విద్యార్థి సంగం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి



**పుల్కర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ రాష్ట్రములోని 40 లక్షల జనాభా ఉన్న గిరిజనులకు మంత్రి పదవిని కేటాయించాలి అని గిరిజన విద్యార్థి సంగం ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల్ సింగ్ నాయక్ డిమాండ్. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి15 నెలలు పూర్తి అయిన కూడా గిరిజనులకు మంత్రి పదవిఇవ్వడం లేదు వెంటనే మంత్రి వర్గంలో గిరిజనులకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి.బుధవారం గిరిజన విద్యార్థి సంగం నాయకులను అక్రమ అరెస్టులు చేశారు.

# అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు

- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది
- జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- భూములు,అడవులు,పక్షులు, జంతువులు అందమైన ప్రకృతిని కాపాడాలి
- 400 ఎకరాల భూమి విక్రయాన్ని విరమించుకోవాలి
- విద్యార్థులపై లాఠీ చార్జీ చేయడాన్ని ఖండిస్తున్నాం
- సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం






**వైరా,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అక్రమ అరెస్టులు,నిర్బంధాలు, లాఠీ చార్జీలతో ప్రజా ఉద్యమాలు ఆపలేరని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని,యూనివర్సిటీల భూములు,అడవులు,పక్షులు అందమైన వృక్షాలు, ప్రకృతిని కాపాడాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమి విక్రయాన్ని విరమించుకోవాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులపై పోలిసులు లాటీ చార్జీ చేయటాన్ని, విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపిన సిపిఐ(ఎం) పార్టీ, ప్రజాసంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వైరా రింగ్ రోడ్డు సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ..జీవ వైవిధ్యం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, లెకపోతే ప్రజల మనుగడ ప్రమాదంలో పడుతుందని,విభిన్న రకాల వృక్షాలు,పక్షులు, జంతువులు, జలచరాలు, క్షీరదాలకు నిలయమై హైదరాబాదుకు ఊపిరితిత్తులు లాగా స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అమ్మడాన్ని ప్రకృతి ప్రేమికులు,మేదావులు, ప్రజాస్వామ్య వాదులు వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వం అమ్ముతున్న 400 ఎకరాల భూమిలో 734 రకాలకు చెందిన నాలుగు లక్షల వృక్షాలు, 223 రకాల జాతులకు చెందిన పక్షులు,నక్షత్ర తాబేళ్లు,జింకలు, దుప్పులు,నెమళ్లు జీవ వైవిధ్యంతో నివసిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తున్న అడవులు ఉన్నాయని తెలిపారు.యునివర్సిటీ అబివృద్ధి కోసం ఉపయోగించాల్సిన భూములను ప్రభుత్వం తమ మనుగడ కోసం అమ్ముకోవడం తగదని హితవు పలికారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక మాయ మాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు అనుసరిస్తూ ప్రజా పోరాటాల మీద, నాయకుల మీద నిర్బంధం పెంచిందని విమర్శించారు. విద్యార్థులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లల్లో నిర్బంధించి మరోసారి ఆందోళన చేయబోమని అంగీకరిస్తూ వీడియో చేస్తేనే విడుదల చేస్తామని ఒత్తిడి చేయడాన్ని, శాంతి యుతంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులపై పోలిసులు లాటీ చార్జీ చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని అన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ తన ఏడవ గ్యారెంటీగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత అప్రజాస్వామికంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామని, 400 ఎకరాల భూమి అమ్మకం ప్రయత్నాలను విరమించాలని, విద్యార్థులు, నాయకుల మీద పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన విద్యార్థులు,సిపిఎం నాయకులను వెంటనే బెషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్,వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు,రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, నాయకులు తోట నాగేశ్వరావు,పారుపల్లి కృష్ణారావు,తూము సుధాకర్, రాచబంటి భత్తిరన్న, హరి వెంకటేశ్వరావు,కామినేని రవి, సంక్రాంతి పురుషోత్తమరావు, యనమద్ది రామకృష్ణ,తాళ్లూరి నాగేశ్వరరావు, పారుపల్లి శ్రీనాథ్ బాబు,మాడపాటి వెంకటి, కురుగుంట్ల శ్రీనివాసరావు,వెల్లుల మైఖేల్,నల్లమల కోటేశ్వరావు, పాసంగులపాటి చలపతిరావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పేలుడు పదార్థాలు, పేల్చే పద్ధతులపై అవగాహన

**పటాన్ చేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రెండు రోజుల సాంకేతికత మార్పిడి కార్యక్రమంలో వక్తలుగా పరిశ్రమ-విద్యా నిపుణులు,గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'గనులు-క్వారీ పరిశ్రమ కోసం మౌలిక సదుపాయాలు,పేలుడు పదార్థాలు, పేల్చే పద్ధతుల'పై మే 9-10 తేదీలలో రెండు రోజుల సాంకేతికత మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో పేలుడు సాంకేతికతలో పురోగతులు, ఉత్తమ పద్ధతులను అన్వేషించడానికి పరిశ్రమ నిపుణులు,విద్యావేత్తలు, నిపుణులను ఒకచోట చేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.ప్రాజెక్టు మేనేజర్లు, బ్లాస్టింగ్ ఇంజనీర్లు, నియంత్రణ సంస్థలు,అమలు చేసే ఏజెన్సీలు, తవ్వకం కాంట్రాక్టర్లు, పేలుడు పదార్థాల తయారీదారులు,ఇన్ స్ట్రుమెంటేషన్ నిపుణులు, విద్యావేత్తలు,పరిశోధకులు తదితరులు జ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడానికి,అనుభవాలను పంచుకోవడానికి,భారతీయ పరిశ్రమలో బ్లాస్టింగ్ టెక్నిక్ లను మెరుగుపరచడంపై వ్యూహరచన చేయడానికి ఒక ప్రత్యేక వేదికగా ఈ కార్యక్రమం తోడ్పడనుందన్నారు. బ్లాస్ట్ డిజైన్, ఫలితాలలో భూగర్భ శాస్త్రం పాత్రబీ పేలుడు పదార్థాలు, ప్రారంభ పరికరాలలో పురోగతిబీ ఉపరితరం-భూగర్భ తవ్వకాల కోసం బ్లాస్ట్ డిజైన్,బ్లాస్ట్ ఫలితాల అంచనాబీ బ్లాస్టింగ్-ఉపశమన వ్యూహాల యొక్క పర్యావరణ ప్రభావాలుబీ బ్లాస్ట్ నష్టం- ముందస్తు అంచనా-నియంత్రణ చర్యలు,నీటి కింద బ్లాస్టింగ్ టెక్నాలజీ,పట్టణ వాతావరణంలో బ్లాస్టింగ్ పద్ధతులు అనే అంశాలపై ఈ నిపుణుల మార్గదర్శనం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత నిపుణులు రిసోర్స్ పర్సన్లుగా పాల్గొంటారని,వారిలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వేదాల రామ శాస్త్రిబీ బెంగళూరులోని జాతీయ రాక్ మెకానిక్స్ సంస్థ పూర్వ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్.వెంకటేష్బీ ఎన్ఐటీ రూర్కెలా ప్రొఫెసర్ సింగం జయంతుబీ వారణాసిలోని ఐఐటీ-బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సంజయ్ శర్మబీ నాగపూర్ లోని సీఎస్ఐఆర్-మైనింగ్-ఇంధన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాములుబీ నాగపూర్ విశ్వేశ్వరయ్య ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఎన్.ఆర్. థోటే తదితరులు పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమం గనులు,క్వారీ పరిశ్రమలలో అత్యాధునిక పరిణామాలపై లోతైన అవగాహన పొందడానికి, బ్లాస్టింగ్ టెక్నాలజీ ఆవిష్కరణల గురించి తెలుసుకోవడానికి ఒక విలువైన అవకాశంగా అభివర్ణించారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు, ఇతర వివరాల కోసం డాక్టర్ జి. జ్యోతికుమారిని 97019 28209ను సంప్రదించాలని, jganta@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని, లేదా వెబ్ లింక్ https://forms.gle/ bcdoyFpJfNLLgj9G6. ను సందర్శించాలని సూచించారు.

# రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు పొడిగింపు

- దరఖాస్తు చివరి తేదీ ఏప్రిల్ 14
- డిఎండబ్ల్యూఓ హనుమంతరావు



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాజీవ్ యువ వికాస పథకము ద్వార స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు గడువు 14.04.2025 వరకు పొడిగించారని డిఎండబ్ల్యూఓ హనుమంతరావు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం ద్వార మైనారిటీలు అనగా ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు మరియు పారశిల కొరకు అర్హులైన అభ్యర్థులు OBMMS పోర్టల్ https://tgobmmsnew.cgg.gov.in ద్వారా ఏప్రిల్ 14 వతేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## అర్హతలు

వ్యవసాయ పథకాలకు 21-55 సంవత్సరాలు (జూలై 1నాటికి), వ్యవసాయ మరియు సంబంధిత రంగాలకు: 21 నుండి 60 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని ఆయన తెలిపారు.

దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్ , రేషన్ కార్డు,ఆదాయ ధ్రువపత్రం కలిగి ఉండాలని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి రూ.1,50,000 లోపు,పట్టణ ప్రాంతాలలో సంవత్సరానికి రూ.2,00,000 మించకుండ ఉండాలని అన్నారు.

తెలంగాణ ఏర్పాటు తర్వాత జారీ చేసిన కుల ధ్రువికరణ పత్రము కలిగి ఉండాలని తెలిపారు.

రవాణా పథకాలకు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,అదేవిధంగా వ్యవసాయ పథకాలకు పథకాలకు పట్టాదార్ పాస్ బుక్ ఉండాలని తెలిపారు.దివ్యాంగులకు సదరం ధ్రువపత్రం కలిగి ఉండాలని అన్నారు.మొత్తం లక్ష్యంలో మహిళలకు కనీసం 25 శాతం,అదేవిధంగా ఒంటరి మరియు వితంతువులు, వికలాంగులు కనీసం 5 శాతం అర్హులని తెలిపారు.తెలంగాణ ఉద్యమ వీరులు,ఎస్సీ ఉపవర్గ ఉద్యమాల్లో త్యాగం చేసిన వారి కుటుంబాలు,స్వయం ఉపాధిక లో నైపుణ్యం ఉన్నవారు

%వాదీవీమీ% పోర్టల్లో నమోదు చేసుకొని అట్టి ఫారమ్ ను డౌన్లోడ్ చేసుకొని తెలుపబడిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నకు సమర్పించాలని అదేవిధంగా పట్టణ ప్రాంతాలకు చెందిన వారు మున్సిపల్ కార్యాలయములో సమర్పించాలని ఆయన తెలిపారు.

ఒక కుటుంబానికి/రేషన్ కార్డుకి చెంది గత 5 సంవత్సరాల్లో ప్రభుత్వము నుండి లబ్ది (సబ్సిడీ) పొందిన వారు అనర్హులని ఆయన తెలిపారు.ఆర్థికంగా సాధ్యమయ్యే స్వయం ఉపాధి కార్యకలాపాన్ని ఎంపిక చేసుకోవాలి డిఎండబ్ల్యుఓ హన్మంతరావు తెలిపారు.

# బురదమయంగా తురకగూడెం గ్రామపంచాయతి

- రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- మురికివాడగా తురకగూడెం

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూసుమంచి మండలంలోని తుర్కగూడెం గ్రామపంచాయతీ మురికి కూపంగా మారింది గ్రామంలో సమస్యలు ఎక్కడి కక్కడే తిష్టవేశాయి. ప్రజా ప్రతినిధుల పదవి కాలం ముగి యడంతో ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక అధి కారులుగా నియమించింది పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన గాడి తప్పుతుందని ఆరోపణలు లేకపోలేదు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమ స్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవతున్నారని విమర్శలు లేక పోలేదు. ప్రత్యేక పాలనలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొన్నది గ్రామాలలో అంతర్గత రోడ్ల అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.గ్రామంలో ఏర్పడిన గుంతల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.వివరాల్లోకి వస్తే మండల పరిధిలోని తురకగూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల దగ్గర పెద్ద గుంత ఏర్పడింది.దీంతో డ్రైనేజీ లేక నీరు నిల్వ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలోని ట్రాన్స్ఫారం పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశు భ్రంగా మారింది. కూసుమంచి మండలంలో తురకగూడెం స్మశాన వాటిక దగ్గర వేసిన బోరువాటర్ ను ఎస్సీ కాలనీకు వాటర్ విడుదల చేయటం వల్ల వస్తున్నాయి.దురద, మచ్చలు,వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని మంత్రికి ఫిర్యాదు చేయగా మంత్రి పొంగులేటి అట్టి ఓటరు ఆఫ్ చేయాలని ఆదేశించినా కూడా పట్టించుకోని అధికారుల తీరు.మంత్రి పొంగులేటి చెప్పినా పటించికొని అధికారులు అట్టి నిరు వాడోదు అని చెప్పినా ఈ రోజువరకు మంత్రి ఆదేశాలు తుంగలో తొక్కారు మంత్రి మాటకే లెక్కలేకుండా పోయింది అని గ్రామ ప్రజలు వాపోతున్నారు.





## పాఠశాలలో పక్కన మురుగు నీరు

రోడ్డు వర్క్ అనే చెప్పి రెండు నెలలు గడుస్తున్నా కూడా మట్టిని తవ్వి మురికివాడగా మార్చిన కాంట్రాక్టర్ పట్టించు కోవడం లేదు అదే తీరులో అధికారులు,ఈ రోజువారకు పంటించికొని అధికారులు దీంతో మురుగు నీరు,మురుగు కాలువ నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో విషసర్పాలు సంచరి స్తుండటంతో భయాందోళనకు గురయ్యే పరిస్థితి దాపు రించిందని స్థానికులు పేర్కొంటున్నారు. మురుగు కారణంగా దోమలు అధికమై రాత్రి సమయంలో ప్రశాంతంగా నిద్ర పోయే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందని గ్రామ ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా మండల ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే కొంతమేరకు సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామ ప్రజలు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు.

## స్థానికంగా ఉండని గ్రామ కార్యదర్శులు..

మండలంలోని 41 గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శి స్థానికంగా ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహ రిస్తున్న పరిస్థితి దాపురించిందని స్థానికులు పేర్కొంటు న్నారు.చిన్న గ్రామ పంచాయతీ తురక గూడెం గ్రామాంకు ఇన్‌చార్జ్ కృష్ణాపురం పంచాయతీ సెక్రెటరీ మాధవి కార్యదర్శగా కొనసాగుతున్నారు దీంతో ఇన్చార్జి కార్యదర్శి గ్రామాలకు సరిగ్గా వెళ్లకపోవడంతో ప్రజలు కార్యదర్శికి ఫోన్ చేసి ఎక్కడ ఉంటే అక్కడ వెళ్లి లేదా మండల హెడ్ క్వార్టర్ కు వెళ్లి లేదా గ్రామానికి రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చినప్పుడు అవసరం ఉన్న పనులు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆయా గ్రా మాల ప్రజలు పేర్కొంటున్నారు.

## గ్రామానికి రెగ్యులర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నియమించాలి

ఇన్‌చార్జ్ కార్యదర్శగా ఉన్న వారి స్థానంలో వెంటనే పంచాయతీ రెగ్యులర్ కార్యదర్శును నియమిం చాలని గ్రామప్రజలు కోరుతున్నారు. ఏదేమైనా స్థానికంగా పంచాయతీ కార్యదర్శుఉంటే ప్రజల,గ్రామ సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు.పంచాయతీ కార్యదర్శిని నియమించాలి.

గ్రామానికి రెగ్యులర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నియమించాలి.రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో గ్రామంలోని సమస్యలు పరిష్కారం కావడంలేదు అని సమస్యలపై అధికారులు స్పందించాలి అని తురకగుడెం మాజీ సర్పంచ్,కౌసల్య లింగయ్య, అధికారులను కోరారు.గ్రామంలో నెలకొన్న మురికి కాలువలో చెత్త, డ్రైనేజ్ సమస్య,రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి పాములు సరచరిస్తున్నాయి. పిచ్చి మొక్కలను తొలగించాలి.

## పాఠశాల పక్కనే ఈ విద్యుత్ ట్రాన్స్ఫారం..అదే దారిలో అంగన్వాడి కేంద్ర

అసలే చిన్న పిల్లలు తెలిసి తెలియని వయసులో పాఠశాలకు పంపిస్తున్న తల్లిదండ్రులు ఎప్పుడు ఏ విధంగా పొంచి ఉంటుందోని పిల్లల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పాఠశాలలుకు పంపిస్తున్న ఇప్పటికే కోతులతో ,వీధి కుక్కలతో, తట్టుకోలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందులోనే పాఠశాలకి ఎదురుగాని ట్రాన్స్ఫారం,పక్కనే బురద, ఏమిచేయాలో తెలియక తల్లిదండ్రులు ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి ట్రాన్స్ఫారం మార్చాలని గ్రామస్తులు పాఠశాల పిల్లల తల్లిదండ్రులు అందరూ ప్రాధేయ పడుతున్నారు ఇట్టి విషయాన్ని విద్యుత్ అధికారులు స్పందించి పిల్లల భవిష్యత్తు కోసం ట్రాన్స్ఫారం మారుస్తారని ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.అలాగే ట్రాన్స్ఫార్మర్ సమీపంలో ఏర్పడిన గుంతను మురుగు నీరు పూడ్చాలి అని గ్రామంలో పరిశుభ్రతపై దృష్టి సారించాలి అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అధికారులని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.